క్లుప్తంగా

వైద్య సిబ్బందిని నియమించాలి

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో సరిపడ వైద్య సిబ్బందిని నియమించాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బంది 19మందికి గాను కేవలం ఇద్దరు మాత్రమే పర్మినెంట్ డాక్టర్లు, తాత్కాలికంగా ఏడుగురు విధులు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆస్పత్రి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు భూమన్న, రవి, కుల్దీప్‌శర్మ, ఓంకార్, చింటూ, రవి బాబు, రఫిక్, కనకయ్య పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

ఆర్మూర్‌టౌన్: రాష్ట్రంలో ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల ఫీజుల దోపిడీని అరికట్టాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్), ప్రగతిశీల మహిళ సంఘం (పీవోడబ్ల్యూ) నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సంబంధించిన గోడపత్రులను అవిష్కరించారు. ఈసందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు సత్తెమ్మ, అనిస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడ వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి సర్కార్ ఆస్పత్రుల లో సౌకర్యాలు, సిబ్బందిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పద్మ, లక్ష్మీ, రవి, మనోజ్, గంగాధర్, శ్రీనివాస్ ఉన్నారు.

బేబీ ఫీడింగ్ క్యాబిన్ ప్రారంభం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో బేబీ ఫీడింగ్ క్యాబిన్ (చంటి పిల్లలకు పాలిచ్చు గది)ని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం సరస్వతీ ప్రారంభించారు. లయన్స్ అధ్యక్షుడు, పృథ్వీరాజ్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నారాయణగౌడ్ సొంత డబ్బులతో క్యాబిన్ ఏర్పాటు చేయడం సంతోషకరమని వారు అన్నారు. డిపో మేనేజర్ రవికుమార్, ఆర్‌సీ డీకే రాజేష్, చేపూర్ గణేష్, సుధీర్‌బాబు, విజయానంద్ పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీకి గిరిజనుల భూములా?

ఆర్మూర్‌టౌన్: ఫార్మా కంపెనీలకు గిరిజన, దళిత, బీసీ వర్గాల భూములే కావాలా? భూస్వాముల భూములు పనికిరావ అని సీపీఐ ఎంఎల్‌మాస్‌లైన్ రాష్ట్ర కార్యావర్గ సభ్యుడు ప్రభాకర్ ప్రశ్నించారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దౌర్జన్యంగా గిరిజనుల భూములను ఫార్మా కంపెనీ కోసం తీసుకోవడం అప్రజాస్వామ్యమన్నారు. లగచర్ల గిరిజనులపైన అర్ధరాత్రి పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నామన్నారు. గిరిజన రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని, బలవంతంగా భూములు లాక్కొవద్దని డిమాండ్ చేశారు. నాయకులు దేవారం, సత్య, నరేందర్, అనీష్, అరవింద్, మనోజ్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్/బోధన్: ఆర్మూర్‌లో శుక్రవారం అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపీఎస్‌యూ) నాయకులు 'ఛలో పార్లమెంట్' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఏఐపీఎస్‌యూ ఆధ్వర్యంలో ఈనెల 28న చేపట్టిన 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే బోధన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోనూ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఆర్మూర్ డివిజన్ కార్యాదర్శి గోపాల్ సింగ్, నాయకులు పాల్గొన్నారు.

శుద్ధీకరణ పనుల పరిశీలన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మల్లారెడ్డి చెరువు శుద్ధీకరణ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువులు కలుషితం కాకుండా ప్రజలు సంరక్షించుకోవాలన్నారు. చెరువులో ఉన్న కాలుష్యంను తగ్గించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఢిల్లీకి చెందిన లిక్విట్ ట్రీస్ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని శాస్త్రవేత్తలు అంతి ఆచార్య, పాటిల్ అన్నారు. వైస్ చైర్మన్ షేక్మున్ను, కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రెంజల్(బోధన్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమలు పుట్టకుండ, కుట్టకుండ తగిన నివారణ జాగ్రత్తలు పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్‌రావ్ సూచించారు. మండలంలోని బోర్గాం గ్రామంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో జ్వర సర్వే చేశారు. దోమల నివారణ మందులు పిచికారీ చేయించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- పెద్దవాగు నుంచి నిత్యం ట్రాక్టర్లతో తరలింపు
- పట్టించుకోని అధికారులు



రెంజర్ల మీదుగా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

బాల్కొండ: మోర్తాడ్ మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. మండలంలోని శెట్‌పల్లి శివారులోగల పెద్దవాగు నుంచి అక్రమార్కులు ఇసుకను తవ్వేస్తూ, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాలకు జోరుగా తరలిస్తున్నారు. వాగు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామాలకు కూడ రూ.4500 నుంచి రూ.4800 వరకు ఇసుకను విక్రయిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో ట్రిప్పులు తిప్పుతూ ఇసుకను తరలిస్తున్నారు. ప్రజలకు తక్కువ ధరకు ఇసుకను అందించుట కోసం ఉచిత ఇసుక పాలసీ కోసం అధికార పార్టీ పెద్దలు ప్రయత్నం చేస్తూ, తక్కువ ధరకు ఇసుక అందించాలని సూచిస్తున్నారు. కానీ ఇసుకాసూరులు మా త్రం ట్రాక్టర్ ఇసుక రూ.6వేల కంటే ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారు. ప్రభుత్వానికి డీడీల రూపంలో ఎలాంటి రుసుం చెల్లించకుండ ఇసుకను తరలిస్తున్నారు. పెద్దవాగు ప్రవహిస్తున్న గ్రామల నుంచి ఇసుకను తీస్తే ఆ గ్రామాభివృద్ధి కమిటీకి రూ.2వేలు చెల్లించి ట్రాక్టర్ ఇసుకను తోడుకోవాలి. మళ్లీ ఇసుక అక్రమంగా తరలిస్తున్నందుకు అధికారులకు వాటాలు ఇవ్వాలి. దీంతో ఇసుక అక్రమ రవాణా వ్యాపారులకు, అధికారులకు మాత్రమే వరం మవుతుంది. వినియోగదారులకు మాత్రం ఎలాంటి ప్రయోజనం లేదు.పైగా ఇతర దూర ప్రాంతాలకు అక్రమంగా తరలిపోతుంది.

అధికారులకు వాటాలు?

ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తరలింపులో అధికారులకు కూడ వాటాలు ఇస్తుండటంతో ఇలాంటి దుస్థితి నెలకొందని సమాచారం. ఇసుక తరలింపు పాయింట్ గల మండలంలో మండల అధికారులకు ట్రాక్టర్‌కు రూ.150నుంచి రూ.200, ఇతర మండలాల మీదుగా ఇసుకను తరలిస్తే ట్రాక్టర్ రూ.100 ఇవ్వడానికి ఇసుక వ్యాపారులు ముందే అధికారులతో ఒప్పందం చేసుకుంటున్నారు. దీంతో వారు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. అధికారుల వాటాను కూడ ఇసుక వ్యాపారులు వినియోగదారుల వద్ద వసూలు చేస్తున్నారు. ఈక్రమంలో ఇసుక ధర ప్రియమవుతుంది. అయినా అక్రమ రవాణాపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు 'సాక్షి' ఫోన్‌లో సంప్రందించిన ఎలాంటి స్పందన ఇవ్వలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంటకు చీరలే రక్షణ



వెంచిర్యాల్ శివారులో వేరు శనగ పంట చుట్టూ కట్టిన చీరలు

ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామ శివారులో సాగు చేస్తున్న వేరు శనగ పంటకు చుట్టూ పాత చీరలను రైతులు కట్టారు. దీంతో పంట చేనుకే చీర కట్టినట్లు కనిపిస్తుంది. వేరు శనగా పంటను అడవి పందులు, ఉడుతల నుంచి కాపాడు కోవడం కోసం పంట చేను చుట్టూ చీరలను కట్టినట్లు రైతులు తెలిపారు. ఈక్రమంలో చీరలు పలువురుని ఆకట్టుకుంటున్నాయి. – బాల్కొండ

తాటి చెట్టుపై రావి చెట్టు



ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో తాటి చెట్టు పై రావి చెట్టు మొలకెత్తింది. గ్రామ శివారులోని బీడు భూముల్లో ఉన్న తాటి చెట్టు మధ్యలో రావి చెట్టు మొలకెత్తింది. భూమిపై లేకుండ కేవలం తాటి చెట్టు కొమ్మల మధ్యలో నుంచి మొలకెత్తడం తో అటువైపు వెళ్లేవారు చిత్రంగా ఆ చెట్టును చూస్తున్నారు. రావి చెట్టు భూమి పైనే కాదు చెట్టుపై కూడ మొలకెత్తునని ఈ చిత్రం ద్వారా తెలుస్తోంది. – బాల్కొండ

ఆధ్యాత్మికం..

నాగమ్మకు ప్రత్యేక పూజలు



బోధన్‌టౌన్(బోధన్): బెల్లాల్ చెరువు కట్టపై గల పాప నాగమ్మకు శుక్రవారం బెల్లాల్ తర్ఫకు చెందిన రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం, బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ప్రారంభమైన భీమన్న ఉత్సవాలు

దొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని చిన్నయానం గ్రామంలో భీమన్న దేవుడి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పండుగలో భాగంగా శుక్రవారం దేవుడి గదాలను తీసుకెళ్లి గంగాస్నానం చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు, ఆరెత్తడం నిర్వహించారు. అలాగే శనివారం దేవుడి కల్యాణం, అన్నసత్రం, ఆదివారం అగ్ని గుండం, నాగెల్లి, వనభోజనాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పుష్కరక్షేత్రంలో భక్తుల సందడి

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. కార్తీకమాస శుక్రవారం కావడంతో నదీ స్నానమాచరించడానికి భక్తులు తరలివచ్చారు. నదిలో పుణ్య స్నానాలు చేసి, తెప్పలు వదిలారు. నది ఒడ్డునగల పుష్కరరాజ్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆన్‌లైన్ నమోదు పక్కాగా చేయాలి



రెంజల్(బోధన్): సమగ్ర ఇంటింటి సర్వే ఆన్‌లైన్ నమోదును పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్ సూచించారు. రెంజల్‌లోని ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ నమోదును శుక్రవారం సూపరింటెండెంట్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఆన్‌లైన్ నమోదులో తప్పులకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి వివరించారు.

గుమ్మిర్యాల్‌లో మేకల సంత ప్రారంభం



గుమ్మిర్యాల్‌లో మేకల సంతను ప్రారంభిస్తున్న గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌లో శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ మేకల సంతను ప్రారంభించింది. గతంలో మేకల కోసం వ్యాపారులు నవీపేట్, రెంజల్ మండలం సాటాపూర్‌కు వెళ్లేవారు. ఇప్పుడు అలా అంత దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ గ్రామంలోనే ప్రతి వారం సంత నిర్వహించనున్నారు. పొరుగున ఉన్న నిర్మల్, జగిత్యాల్ జిల్లాల గ్రామాలతో పాటు మన జిల్లాలోని గ్రామాల వారికి అనుకూలంగా ఉండే ప్రదేశంలో సంత నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు వీడీసీ ప్రతినిధులు తెలిపారు. మేకల వ్యాపారులతో పాటు ఆ మూగజీవాలు అవసరం ఉన్నవారు ఇక్కడకు వచ్చి తమ వ్యాపారం చేసుకోవడానికి అన్ని చర్యలు తీసుకున్నారు. సంత నిర్వహణ వల్ల ప్రజలకు సౌకర్యం కలుగడమే కాకుండా గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కోటగిరిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రెంజల్ మండలం సాటాపూర్‌లో..



పోచారంలో..

రుద్రూర్/రెంజల్/పెర్కిట్/ఎడపల్లి: బోధన్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో శుక్రవారం సీఎం రేవంత్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. బాణా సంచా పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈసందర్భంగా కోటగిరి, రెంజల్, ఎడపల్లి మండలాల్లో పార్టీ శ్రేణులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేయడం పై వారు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు రైతులకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తులతో ఆదాయం వృద్ధి



మోర్తాడ్: ఆహార ఉత్పత్తుల తయారీతో ఆదాయం పెంపొందించుకోవచ్చని సెర్ప్ డీపీఎం మారుతి అన్నారు. భీమ్‌గల్ సెర్ప్ కార్యాలయంలో శుక్రవారం మహిళా సంఘాల సభ్యులు, లబ్దిదారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధానమంత్రి సూక్ష్మ వ్యవస్థీకరణ పథకంలో రుణాలు తీసుకుని ఆహార ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పథకం కింద రుణాలు తీసుకున్నవారికి రూ.లక్షకు 35 శాతం రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు. గానుగ నూనె, పప్పుల మిల్లులు, పిండిగిర్ని, కారం గిర్ని, అల్లం వెల్లుల్లి పేస్టుల తయారీ చేయడానికి అవకాశం ఉందన్నారు. ఏపీఎం రవీంధర్, సీసీలు కుంట శ్రీనివాస్, నరేష్, రఘుపతి, గంగాధర్, భాస్కర్, గంగా లలిత, ముత్యం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బడుల్లో ఐఎఫ్‌పీ



బాల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కోసం ఇకనుంచి ఐఎఫ్‌పీ (ఇంటరేక్టీవ్ ఫ్లాట్ ప్యానెల్స్) అందుబాటులోకి రానున్నట్లు ఎంఈవో రాజేశ్వర్ తెలిపారు. బాల్కొండలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎంలకు, ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీలపై సాంకేతిక నిపుణుడు రాకేశ్ శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయుటకు ప్రభుత్వం అనేక నూతన కార్యక్రమాలను చేపడుతుందన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1న మాలల సింహగర్జన



వేల్పూర్: వచ్చేనెల 1న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మాలల సింహ గర్జన నిర్వహించనున్నట్లు స్థానిక మాలసంఘ నాయకులు తెలిపారు. ఈమేరకు శుక్రవారం జాన్కంపేట్‌లో స్థానిక మాలసంఘం సభ్యులు కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమానికి మాలలు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సొడ రమేశ్, సొడ చందన్, తలారి శేఖర్, ఎడ్ల సిరిల్‌రావు, సొడ శ్రీనివాస్, సొడ జయరాజ్, తాళ్ల పద్మారావు పాల్గొన్నారు

సంక్షిప్తం

నేడు ఆర్మూర్‌లో కరెంట్ కోత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జిరాయత్ నగర్‌లోగల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం మున్సిపల్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 10గం.ల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

హామీలను నెరవేర్చాలి

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 2న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం తలపెట్టామన్నారు. పట్టణంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలోరాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్ల రామకృష్ణ పాల్గొని, మాట్లాడారు. వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు గంగాధర్, పార్వతిరాజేశ్వర్, కిషన్, నసీర్, ఒడ్డెన్న, మల్లేష్ పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయండి



దొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో రైతుల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్‌రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భూమేశ్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

సేవా కార్యక్రమాలపై అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కార్యదర్శి దేవేందర్, సంస్థ వ్యవస్థాపకుడు సాయిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మాక్లూర్: మండలంలోని వల్లభాపూర్‌లో బాధిత కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం బీజేపీ బూత్ అధ్యక్షుడు లోశారం సచిన్ అందజేశారు. అలాగే ఆయా గ్రామాల్లో కూడ బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక బీజేపీ నాయకులు అందజేశారు. నాయకులు కురుమ మహేష్, నవీన్, ఆంజనేయులు ఉన్నారు.

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఓ బాధిత కుటుంబానికి శుక్రవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ అంకు దామోదర్ అందజేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వంటశాల తనిఖీ

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ ప్రభుత్వ పాఠశాల వంటగదిని శుక్రవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రభాకర్ తనిఖీ చేశారు. హెచ్‌ఎం రాజేందర్, సునంద, ఏఎన్‌ఎం సుజాత, ఆశా వీణ ఉన్నారు.

చిన్నారులకు యూనిఫాంల అందజేత

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 35వ వార్డు అంగన్‌వాడి కేంద్రంలో శుక్రవారం చిన్నపిల్లలకు కొత్త యూనిఫాంను కౌన్సిలర్ ఆకుల సంగీతశ్రీనివాస్ అందజేశారు. బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ప్రశాంత్, అంగన్‌వాడీ టీచర్ బట్టు పద్మ పాల్గొన్నారు.

కుర్నాపల్లిలో వైద్య శిబిరం

ఎడపల్లి(బోధన్): మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు డయాబెటిక్, కంటి పరీక్షలను నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ రాంరెడ్డి, సాయరెడ్డి, క్లబ్ ప్రతినిధులు గంగారెడ్డి, మెర్సీ పాల్గొన్నారు.

నియామకం

నవీపేట: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ) మండల చైర్మన్‌గా రాకేష్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం కౌన్సిల్ ఉత్తర తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సాప పండరి నియామక పత్రాలను అందజేశారు. మాజీ వార్డు సభ్యులు నవీన్‌రాజ్, కాంతంరెడ్డి, భరత్, మోహీజ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ గ్రామానికి చెందిన భూమేశ్వర్ కువైట్‌లో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌రెడ్డి పరామర్శించి, రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, నాయకులు తెడ్డు రమేష్, రేవతి గంగాధర్, శ్రీను, మురళి, పడిగెల ప్రవీణ్, వేముల గంగారెడ్డి, కస్తూరి శ్రీను, కొమ్ముల రవీంధర్, తిప్పిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌ల వితరణ

నవీపేట: మండలంలోని శివతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం హెచ్‌ఎం శివకుమార్ టై, బెల్ట్‌లతోపాటు గుర్తింపు కార్డులను అందజేశారు. తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంఈవో అశోక్, ఎంపీవో రామకృష్ణ, మోహన్‌రెడ్డి, భూమయ్య, గోవర్ధన్ ఉన్నారు.

సునీల్‌రెడ్డికి సన్మానం



వేల్పూర్: మండలంలోని వాడి గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం వీడీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డిని సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వేల్పూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి మహేందర్, బద్దం మహేందర్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు..

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాకేశ్‌చంద్ర శుక్రవారం జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమెను సన్మానించారు.

పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి

వేల్పూర్: చలితీవ్రత ఎక్కువగా ఉన్నందున పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని వేల్పూర్ మండల వైద్యాధికారి వాణి ఒక ప్రకటనలో మండల ప్రజలకు సూచించారు. పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురైతే వైద్యులను సంప్రదించకుండా మందులు వాడొద్దన్నారు. ఇంటి పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్ష్మణ్ మృతి

రుద్రూర్: కోటగిరిలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కాయపల్లి లక్ష్మణ్ అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్, చందూర్ మాజీ సర్పంచ్ కర్లం సాయరెడ్డి, కోటగిరి కాంగ్రెస్ అధ్యక్షుడు షాహీద్, సాయిబాబా తదితరులు ఆయన భౌతికకాయానికి పార్టీ కండువా కప్పి నివాళులు అర్పించారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మందిర (తెలుగు)-10.30 దేవకి నందన వాసుదేవ (తెలుగు)-1.15 7.30 జిబ్రా(తెలుగు)-4.05 10.25
స్క్రీన్-3	మెకానిక్‌రాకీ(తెలుగు)-12.15 6.45 10.00 లక్కీ భాస్కర్(తెలుగు)-3.30
స్క్రీన్-4	అమరన్(తెలుగు)-11.35 6.20 మెకానిక్‌రాకీ(తెలుగు)-3.05 లక్కీభాస్కర్(తెలుగు)-9.50

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఫ్యాషియన్)

స్క్రీన్-1	అమరన్ -10.30 4.25 10.30 లక్కీ భాస్కర్(తెలుగు)-1.30 7.40
స్క్రీన్-3	కంగువ(2డీ-తెలుగు)-10.30 4.30 10.40 అమరన్ -1.30 7.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కంగువ 3డీ తెలుగు-11.50 3.15 6.40 10.10
స్క్రీన్-2	గ్లాడియేటర్-2 (తెలుగు)-12.10 మట్కా(తెలుగు)-3.35 7.00 క(తెలుగు)-10.25
స్క్రీన్-3	అమరన్(తెలుగు)- 11.45 3.15 6.50 లక్కీ భాస్కర్(తెలుగు)-10.25
స్క్రీన్ -4	క(తెలుగు)-1.00 లక్కీ భాస్కర్(తెలుగు)-4.15 గ్లాడియేటర్(తెలుగు)- 7.30 అమరన్(తెలుగు)- 10.45
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	మట్కా (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	కంగువ 3డీ (తెలుగు)

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	77,300	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	71,317	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800